
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి మెదక్
5
ఆదివారం 10 మార్చి 2024
జిల్లాల వార్తలు





ఏడుపాయలలో అమ్మవారి బోనాల ఊరేగింపులో ఉత్సాహంగా చిందేస్తున్న యువతి



ఏడుపాయల ఆలయ వీధుల్లో గుమ్మటాల బండ్లు

బండెనక బండి..



మంజీరాలో పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు





అమ్మవారి పల్లకీ ఊరేగింపు

ఏడుపాయలలో వైభవంగా బండ్ల ఊరేగింపు

పాపన్నపేట, మార్చి 9 : జానపదుల సంస్కృతికి అద్దంపట్టే ఏడుపాయల జాతరలో బండ్ల ఊరేగింపు అంగరంగ వైభవంగా కొనసాగింది. మెదక్ జిల్లాలోని ఏడుపాయల వనదుర్గామాత క్షేత్రంలో మహాశివరాత్రి జాతర రెండోరోజు శనివారం బండ్ల ఊరేగింపు నిర్వహించారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వందలాదిగా బండ్లు తరలివచ్చాయి. జోడెడ్ల బండ్లను రంగుల చీరలు, చమ్కీల కాగితాలు, మామిడాకుల తోరణాలు, గుమ్మటాలతో అలంకరించిన బండ్లు జాతరకే ఆకర్షణగా నిలిచాయి. బండ్లపై శివసత్తులు చెర్నాకోలలు పట్టుకుని శిగాలు ఊగుతుండగా.. డప్పు చప్పుళ్ల మధ్య భక్తులు చిందులేస్తూ అమ్మవారి ఆలయానికి చేరుకున్నాయి. ఆనవాయితీ ప్రకారం పాపన్నపేట సంస్థానాధీశుల బండికి చైర్మన్ బాలాగౌడ్, ఈవో మోహన్‌రెడ్డి, ధర్మకర్తలు, స్థానిక నాయకులు స్వాగతం పలికారు. ఊరేగింపులో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా మెదక్ డీఎస్పీ రాజేష్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. అంతకుముందు ఆలయ ప్రాంగణంలో జాగరణలు చేసిన భక్తులు ఉదయాన్నే అమ్మవారిని దర్శించుకున్నారు. బోనాలు, ఒడిబియ్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. బండ్ల ఊరేగింపును తిలకించటానికి వేలాదిగా భక్తులు తరలివచ్చారు.



బారులుతీరిన ఎడ్ల బండ్లు

నందివాహనంపై ఊరేగిన

గరళకంఠుడు

- కేతకీలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు
- భక్తిశ్రద్ధలతో లింగోద్భవ పూజలు, జాగరణలు
- నేడు పార్వతీ పరమేశ్వరుల కల్యాణం


ఝరాసంగం, మార్చి 9 : దక్షిణా కాశీగా పేరుగాంచిన కేతకీ సంగమేశ్వరస్వామి ఆలయంలో నవాహ్నిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయంలో శనివారం నందివాహనంపై గరళకంఠుడిని వైభవంగా ఊరేగించారు. నందివాహనంపై స్వామివారి ఉత్సవ విగ్రహాలను ప్రతిష్ఠించిన అర్చకులు వేదామంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల మధ్య ప్రత్యేక పూజల అనంతరం ఊరేగింపు ప్రారంభించారు. స్వామివారి ఎదుట భక్తులు వీరభద్రుడి వేషాధారణలో దండకాలు వేయడం ఆకట్టుకున్నది.

భక్తిశ్రద్ధలతో లింగోద్భవ పూజలు

కేతకీ ఆలయంలో మహాశివరాత్రి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శివరాత్రి ఉపవాస దీక్షలను విరమించిన భక్తులు ఆలయ ప్రాంగణంలో భజనలు చేస్తూ జాగరణ చేశారు. శనివారం అర్ధరాత్రి లింగోద్భవ సమయంలో స్వామివారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నిత్య పూజలతో పాటు రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, రుద్రస్వాహాకార హోమం, నవగ్రహ శాంతిహోమం నిర్వహించారు. రాష్ట్రంతో పాటు కర్ణాటక, మహారాష్ట్రల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులు అమృత గుండంలో స్నానాలు ఆచరించి స్వామి దర్శనం చేసుకున్నారు. ఆలయ ఆవరణలో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు ఆకట్టుకున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా నేడు సాయంత్రం పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవం, రాత్రి రథోత్సవం నిర్వహించనున్నట్టు ఆలయ అధికారి శశిధర్ తెలిపారు.



గర్భాలయంలో పార్వతీ పరమేశ్వరులు



నందివాహనంపై ఆసీనుడైన కేతకీ సంగమేశ్వరస్వామికి పూజలు చేస్తున్న అర్చకులు


వైభవంగా వెంకట ఖ్వాజా ఉర్సు

- గుర్రాలు, ఒంటెలపై అట్టహాసంగా గందం ఊరేగింపు
- హాజరైన మంత్రి, ఎమ్మెల్యే, నేతలు

వట్‌పల్లి, మార్చి 9: మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే వట్‌పల్లిలోని వెంకటఖ్వాజా ఉర్సు శనివారం అట్టహాసంగా ప్రారంభమైంది. 39వ ఉత్సవాలను తిలకించేందుకు ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా హైదరాబాద్, నిజామాబాద్ జిల్లాలు, పొరుగున ఉన్న కర్ణాటక, మహారాష్ట్రాలకు చెందిన భక్తులు తరలిరావడంతో ఆశ్రమం కిటకిటలాడింది. వట్‌పల్లి చౌరస్తాతో పాటు ఆశ్రమ ప్రాంగణమంతా కిటకిటలాడింది. ఒంటెలపై గంధలను తీసుకువచ్చే ఊరేగింపును భక్తులు ఆటపాటలతో అట్టహాసంగా నిర్వహించారు. యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వినయ్‌గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రమేష్ జోషి, ఎంపీపీ పత్రి కృష్ణవేణి, జడ్పీటీసీ పత్రి అపర్ణ, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గందం ఊరేగింపు





కొమురవెల్లి మల్లన్న ఆలయ ప్రాంగణంలో పెద్దపట్నం వేస్తున్న ఒగ్గు పూజారులు

పరవశం

కన్నులపండువగా పెద్దపట్నం

- 150 మంది ఒగ్గుపూజారులు, 41 వరుసలతో పట్నం
- మల్లన నామస్మరణతో మార్మోగిన కొమురవెల్లి

కొమురవెల్లి, మార్చి 9 : కొమురవెల్లి మల్లికార్జునస్వామికి అత్యంత వైభవంగా పెద్దపట్నం వేశారు. మహాశివరాత్రి సందర్భంగా శనివారం తెల్లవారుజామున ఆలయ తోటబావి ప్రాంగణం వద్ద యాదవుల సంప్రదాయ ప్రకారం మల్లన్నకు ఘనంగా లగ్గం నిర్వహించారు. లింగోద్భవ సమయలో గర్భగుడిలో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, పల్లకీసేవ నిర్వహించారు. ముందుగా ఒగ్గుపూజారులు స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పించారు. ఆనవాయితీ ప్రకారం స్వామికి కోనేరులో తెప్ప స్నానం, సుంకుపట్టి, మైలపోలు కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం తోటబావి ప్రాంగణంలో స్వామివారి త్రిశూలం, ఢమరుకం ప్రతిష్ఠించారు. అనంతరం ఒగ్గు పూజారుల సంఘం సభ్యులు 150 మంది 41 వరుసలతో పసుపు, కుంకుమ, తెల్లపిండి, పచ్చ, సునేరుతో పెద్దపట్నాన్ని తీర్చిదిద్ది నిమ్మకాయతో చిత్ర కన్న నెలకొల్పారు. ఒగ్గుపూజారులు మల్లన్న బోనాలను తీసుకొచ్చిన అనంతరం పట్నంపైపెట్టి స్వామికి నైవేద్యం సమర్పించారు. పట్నానికి నలువైపులా గుమ్మడికాయలు, నిమ్మకాయలతో బలిహరణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకుడు మహదేవుని మల్లికార్జున్ ఆధ్వర్యంలో అర్చకులు స్వామివారి ఉత్సవ విగ్రహాలను తీసుకువచ్చి, పట్నం చుట్టూ ప్రదక్షిణలు చేసి పట్నం తొక్కడం ప్రారంభించారు. పెద్దపట్నాన్ని తిలకించిన భక్తులు మల్లన్నను స్మరిస్తూ పట్నంపై నడిచి తన్మయత్వం చెందారు.



మల్లన్న ఆలయంలో పూజలు



పెద్దపట్నం తిలకించేందుకు తరలివచ్చిన భక్తులు

మార్చిలోనే మంటలు

- ఉమ్మడి మెదక్ జిల్లాలో భానుడి భగభగలు
- సిద్దిపేట జిల్లా దూల్మిట్టలో 39.7 డిగ్రీలు
- సంగారెడ్డి జిల్లా కల్హేర్‌లో 39.3 డిగ్రీలు
- మెదక్ జిల్లా దామారంచలో 39 డిగ్రీలు

మెదక్ అర్బన్, మార్చి 9: వేసవి ప్రారంభంలోనే భానుడు భగభగమంటున్నాడు. ఉమ్మడి మెదక్ జిల్లాలో ఎండలు మండుతున్నాయి. మార్చి నెల ప్రారంభంలోనే ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు చేరువయ్యాయి. శనివారం సిద్దిపేట జిల్లా దుల్మిట్టలో 39.7 డిగ్రీల అత్యధికంగా ఉష్ణోగ్రత నమోదయింది. సంగారెడ్డి జిల్లా కల్హేర్‌లో 39.3 డిగ్రీలు, మెదక్ జిల్లా దామరంచలో 39 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

రోడ్లు నిర్మానుష్యం

ఉదయం 10 గంటలు దాటితే జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. బయట వెళ్లలేని పరిస్థితి నెలకొంది. మధ్యాహ్న సమయంలో రోడ్లు, మార్కెట్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. నిత్యం ప్రయాణికులతో కిటకిటలాడే బస్టాండ్లు, ప్రధాన కూడళ్లు బోసిపోతున్నాయి. సాయంత్రం 5 గంటలు దాటినా ఎండ తీవ్రత తగ్గడం లేదు. ఇప్పుడే ఇలా ఉంటే ఏప్రిల్, మే నెలల్లో ఎండల తీవ్రత ఏ విధంగా ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఉష్ణోగ్రతలు...

- సిద్దిపేట జిల్లా దూల్మిట్టలో అత్యధికంగా 39.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా... అంగడికిష్టాపూర్‌లో 39.4 డిగ్రీలు, తుక్కాపూర్‌లో 38.4 డిగ్రీలు, ములుగులో 38.7 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.
- సంగారెడ్డి జిల్లా కల్హేర్‌లో 39.3 డిగ్రీలు, సదాశివపేటలో 38.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.
- మెదక్ జిల్లా దామరంచలో 39 డిగ్రీలు, చిన్నశంకరంపేటలో 38 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

చిన్నారులు, వృద్ధులు పదిలం

ఉమ్మడి జిల్లాలో ఎండ తీవ్రత రోజు రోజుకూ పెరుగుతున్నందున తప్పని పరిస్థితుల్లో బయటకు వచ్చే వారు రక్షణ చర్యల్ని తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. వేసవిలో ఎక్కువగా చిన్నారులు, వృద్ధులు డీహైడ్రేషన్‌కు గురవుతుంటారని పేర్కొంటున్నారు. వడదెబ్బ బారినపడే ప్రమాదం ఉండడంతో జాగ్రత్తలు పాటించాలని వైద్యులు చెబుతున్నారు. శరీరంలో లవణాలు తగ్గకుండా ఉండటానికి పండ్ల రసాలు, మజ్జిగ తాగించాలని వైద్యులు సూచిస్తున్నారు.



కౌన్సిలర్లకు కాసుల గలగల

- ఎన్నికలు.. అవిశ్వాసాలతో రాబడి
- పదవి కోసం ఖర్చుకు వెనుకాడని చైర్మన్లు, ఆశావహులు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, మార్చి 9 : సాధారణ ఎన్నికలు, అవిశ్వాస తీర్మానాలు, కొత్త చైర్మన్ల ఎన్నికలు.. వెరసి మున్సిపల్ కౌన్సిలర్లకు డిమాండ్ పెరిగిపోయింది. మున్సిపాలిటీని బట్టి రూ. లక్షల్లో వసూలు చేస్తున్నారని వినిపిస్తున్నది. 2019 జనవరిలో మున్సిపాలిటీ ఎన్నికలు, చైర్మన్, వైస్ చైర్మన్ల ఎన్నికలు జరిగాయి. ప్రధాన పార్టీలన్నీ స్థానికంగా బలం ఉన్న, గెలుపు అవకాశాలున్న నాయకులకు కౌన్సిలర్ టికెట్ ఇవ్వడమే కాకుండా ఎన్నికల ఖర్చు నిమిత్తం రూ.లక్షల్లో నిధులు సమకూర్చాయి. ఎన్నికల్లో గెలిచిన అనంతరం చైర్మన్, వైస్‌చైర్మన్ల ఎన్నిక సమయంలో ఒక్కో కౌన్సిలర్‌కు రూ. 5 లక్షల వరకు ముట్టజెప్పారని ఆరోపణలున్నాయి. అనంతరం జరిగిన కో-ఆప్షన్ సభ్యుల ఎన్నిక సందర్భంగా ఆయా పార్టీల నుంచి బరిలో ఉన్నవారు తమకు అనుకూలంగా ఓటేయాలంటూ రూ. లక్షల్లోనే ముట్టజెప్పినట్టు సమాచారం. 2022 డిసెంబరులో జరిగిన స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కౌన్సిలర్లు మరోసారి రూ.లక్షల్లో తీసుకున్నట్టు తెలుస్తున్నది. ఇలా పలుమార్లు కౌన్సిలర్లు భారీగానే వెనుకేసుకున్నారని ఆరోపణలున్నాయి.

అవిశ్వాసాలతో ఫుల్ డిమాండ్

కౌన్సిల్ కొలువుదీరి మూడేళ్లు పూర్తవడంతో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లపై అవిశ్వాస తీర్మానాలు పెట్టడానికి అవకాశం రావడంతో మరోసారి కౌన్సిలర్లకు మరోసారి డిమాండ్ ఏర్పడింది. గతేడాది జిల్లా కేంద్రమైన సంగారెడ్డితో పాటు సదాశివపేట, నారాయణఖేడ్ మున్సిపల్ చైర్మన్లపై సభ్యులు అవిశ్వాస నోటీసులు ఇచ్చారు. ఆయా ప్రాంతాల్లో అవిశ్వాసం నోటీసులపై సంతకాలు చేసేందుకు కొందరు కౌన్సిలర్లు రూ.2 నుంచి రూ.5 లక్షల వరకు తీసుకున్నట్టు ఆరోపణలున్నాయి. చైర్మన్ పదవి ఆశిస్తున్నవారు ఈమేరకు చెల్లించినట్టు సమాచారం. మరోవైపు అవిశ్వాస తీర్మానం వీగిపోయేలా చేయడానికి పదవిలో ఉన్న చైర్మన్లు కూడా పలువురు కౌన్సిలర్లను తమవైపు తిప్పుకునేందుకు రూ.లక్షల్లోనే ముట్టజెప్పినట్టు తెలిసింది. ఇది కాకుండా కౌన్సిలర్లు చేజారకుండా క్యాంపులు, విహారయాత్రల కోసం, కానుకలు అందించడం కోసం ఒక్కో మున్సిపల్ చైర్మన్ రూ.50 లక్షల వరకు ఖర్చు చేసినట్టు తెలుస్తున్నది. ఇలా కుర్చీని కాపాడుకోవడానికి కొందరు.. పదవి కోసం మరికొందరు రూ. కోట్లలో ఖర్చు చేశారని చర్చ జరుగుతున్నది.

పదవీ కాలం పది నెలలే!

అవిశ్వాస తీర్మానాల అనంతరం సదాశివపేట, నారాయణఖేడ్ మున్సిపాలిటీల్లో కొత్త చైర్మన్లు ఎన్నికయ్యారు. మరోవైపు సంగారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ తనపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మనం వీగిపోయేలా చేశారు. ఇందుకోసం అవసరమైన కౌన్సిలర్లను కూడగట్టడానికి రూ.కోటి వరకు ఖర్చు చేసినట్టు తెలుస్తున్నది. మున్సిపాలిటీల పదవీ కాలం పది నెలలే ఉన్న నేపథ్యంలో చైర్మన్ పదవుల కోసం ఇంత భారీగా ఖర్చు చేయడంపై రాజకీయవర్గాల్లో చర్చ జరుగుతున్నది.

BHIMAA SHIVA THANDAVAM నేడే చూడండి



సుదర్శన్ 35 ఎంఎం - ఎ/సి ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
11.00,2.15,6.00,9.15
GLOBAL CINEMAS LLP

జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు స్వర్ణ

మద్దూరు, మార్చి 9: మద్దూరు మండలం గాగిళ్లాపూర్ గ్రామానికి చెందిన గుడిసె స్వర్ణ జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మేక సంతోష్ ఆధ్వర్యంలో గ్రామస్థులు శనివారం ఆమెను సన్మానించారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ 16 నుంచి 20 వరకు దాద్రానగర్ హవేలిలో జరిగే పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబర్చి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి దామెర మల్లేశం, సభ్యులు నర్సింహులు, సాయికుమార్, మద్దూరు మోడల్ స్కూల్ ఛైర్మన్ బాలస్వామి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మహేష్, అంజయ్య పాల్గొన్నారు.



స్వర్ణను సన్మానిస్తున్న సంతోష్, గ్రామస్థులు

మహిళలకు ఈ నెలాఖరు వరకు ఉచిత ఓపీ

● వెల్‌నెస్ హాస్పిటల్ ఎండీ డా.లాలేష్



మాట్లాడుతున్న వెల్‌నెస్ హాస్పిటల్ ఎండీ డా.లాలేష్, గైనకాలజిస్ట్ డా.ఆలియారూహి

సంగారెడ్డి అర్బన్, మార్చి 9: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సంగారెడ్డి చౌరస్తాలోని వెల్‌నెస్ హాస్పిటల్ ఈ నెలాఖరు వరకు ఉచిత ఓపీ ద్వారా మహిళలకు వైద్య సేవలందించనున్నట్లు ఆస్పత్రి ఎండీ డా.లాలేష్, గైనకాలజిస్ట్ డా.ఆలియారూహి తెలిపారు. సంగారెడ్డిలోని వెల్‌నెస్ హాస్పిటల్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మహిళలు ఎక్కువగా అనారోగ్య సమస్యలతో బాధపడుతుంటారని, మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే అన్నివిధాలా ప్రయోజనం ఉంటుందని, ఈ నేపథ్యంలో మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిసారించి ఉచిత వైద్య చికిత్సలు అందించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. మహిళల్లో ఎలాంటి అనారోగ్య సమస్యకైనా ఉచితంగా వైద్య సేవలందించేందుకు తమ ఆస్పత్రి సిద్ధంగా ఉన్నదన్నారు. సంగారెడ్డి పట్టణంతో పాటు జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో బ్రాంచ్ హెడ్ ఎం.చిన్నా, హెచ్ఆర్ డేవిడ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు హుస్నాబాద్‌లో హాఫ్ మారథాన్

● హాజరుకానున్న మంత్రి పొన్నం

హుస్నాబాద్ టౌన్, మార్చి 9: హుస్నాబాద్ పట్టణంలోని అక్కన్నపేట రోడ్డు స్తూపం వద్ద ఆదివారం తెల్లవారుజామున పోలీసుశాఖ, రన్నింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హాఫ్ మారథాన్‌తో పాటు 10కే, 5కే రన్నింగ్ పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరుకానున్నారు. హాఫ్ మారథాన్‌కు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఈ పోటీలకు దాదాపు 1200 మంది యువతీ యువకులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని రన్నింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆకుల వెంకట్ తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వారికి నగదు బహుమతులు అందజేయనున్నట్లు చెప్పారు.

ఈనెల 15న బ్రహ్మాండమైన విడుదల



సంధ్య 70 ఎంఎం - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
BHUVANESHWARI PICTURES

SUPER HIT నేడే చూడండి



శాంతి 70 ఎంఎం - నారాయణగూడ 11.00,2.00
SUCHIN CINEMAS 9030161717

SUPER HIT నేడే చూడండి



SUPER HIT నేడే చూడండి



ప్రసాడ్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్ 9.20am

SUPER HIT నేడే చూడండి



సంధ్య 70ఎంఎం - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ 11.00am
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
SRI LAKSHMI GAYATRI FILMS 9391176659

ఈనెల 15న బ్రహ్మాండమైన విడుదల



SRI LAKSHMI PICTURES 9885291789

SUPER HIT నేడే చూడండి



దేవి 70ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND
11.00,2.15,6.00,9.15

కుష్ఠును అరికట్టేలా..

- 'ఎల్‌సీడీసీ' పేరిట ఆరోగ్యశాఖ ఇంటింటికి
- 11 నుంచి 24 వరకు ఆశాల సర్వే
- సర్వే ద్వారా 'కుష్ఠు' అనుమానితుల గుర్తింపు
- వ్యాధి నిర్ధారణ కోసం పీహెచ్‌సీ డాక్టర్ల వద్దకు సిఫారసు
- ట్రీట్‌మెంట్ ప్రారంభానికి వైద్య ఆరోగ్యశాఖ చర్యలు



సంగారెడ్డిలో ఎల్‌సీడీసీ సర్వే నిర్వహిస్తున్న ఆశా కార్యకర్తలు, అధికారులు(ఫైల్)



సంగారెడ్డి అర్బన్, మార్చి 9: చర్మంపై స్పర్శలేని మచ్చలు, ఇతర మచ్చలున్నాయా? అంటూ ఆశా కార్యకర్తలు ఇంటింటికి రానున్నారు. లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్(ఎల్‌సీడీసీ)పేరిట వైద్య ఆరోగ్యశాఖ సర్వే నిర్వహించనున్నది. ఈ నెల 11 నుంచి 24వ తేదీవరకు ఆశావర్కర్లు సర్వే చేయనున్నారు. ఏటా చర్మ వ్యాధి బాధితులు పెరుగుతున్నారు. చర్మానికి, నరాలకు సోకి ఇబ్బంది పెట్టే ఈ కుష్ఠు చాప కింద నీరులా విస్తరించి భయాందోళనకు గురిచేస్తున్నది. దీనిని ఆదిలోనే గుర్తించి సరైన చికిత్స అందిస్తే ఆరోగ్యాన్ని రక్షించుకోవచ్చు. ఇదే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా ఎల్‌సీడీసీ పేరిట కుష్ఠు బాధితుల గుర్తింపు సర్వే చేయిస్తున్నారు.

గతేడాది తరహాలో..

సంగారెడ్డి జిల్లాలో 16,13,998 జనాభా ఉన్నారు. గతేడాది ఆగస్టులో వైద్య ఆరోగ్యశాఖ ఎల్‌సీడీసీ సర్వే నిర్వహించింది. ఆ క్రమంలో 3,31,916 ఇళ్లకు వెళ్లి సర్వే చేయగా 5103 మంది కుష్ఠు అనుమానితులున్నట్లు గుర్తించగా, అందులో 23 మందికి కుష్ఠు ఉన్నట్లు తేలినట్లు అధికారులు తెలిపారు. ఈ ఏడాది అదేరకంగా సర్వే చేయాలని ఇప్పటికే ఆశా కార్యకర్తలకు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సమావేశాలు నిర్వహించి ఆదేశాలు జారీ చేశారు.

ఆశాలతో ఇంటింటి సర్వే

జిల్లాలోని పట్టణ, గ్రామాల్లోని ప్రతి ఇంటింటి ఆశా వర్కర్లు వెళ్లి సర్వే చేస్తారు. జిల్లాలోని 34 ఆరోగ్య కేంద్రాల పరిధులలో 928 మంది ఆశావర్కర్లు పనిచేస్తున్నారు. సర్వే చేసినందుకుగాను ప్రతి ఆశా కార్యకర్తకు ఒకరోజుకు రూ.75 చొప్పున చెల్లిస్తారు. ఎల్‌సీడీసీ సర్వేలో భాగంగా ప్రతి ఆశా కార్యకర్త ఒక్కోరోజు రూరల్ ఏరియాలో 15-20 ఇళ్లు, అర్బన్ ఏరియాల్లో 20-25 ఇళ్లను సర్వే చేస్తారు. శరీరంపై తెల్ల మచ్చలు, రాగి వర్ణపు మచ్చలు, స్పర్శలేని మచ్చలు, చర్మం రంగు మారడం, మొద్దుబారిపోవడం, స్పర్శ తెలియకపోవడం లాంటి సమస్యలుంటే వివరాలు నమోదు చేసుకుంటారు. వీరిని సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ దృష్టికి తీసుకెళ్తారు. అనుమానిత లక్షణాలున్న వారిని మరోసారి లెప్రసీ బృందం చేత పరీక్షలు చేయిస్తారు. వ్యాధి ఉన్నట్లు తేలితే ఎండీటీ డ్రగ్స్ లెప్రసీ చికిత్స ప్రారంభిస్తారు.

ఆదిలోనే గుర్తిస్తేనే మేలు

కుష్ఠు ప్రధానంగా మైకోబ్యాక్టీరియం లెప్రె అనే బ్యాక్టీరియా వల్లా సంక్రమిస్తుంది. కుష్ఠు ముఖ్యంగా నరాలకు, చర్మానికి సోకుతుంది. వ్యాధి లక్షణాలు బహిర్గతం కావడానికి మూడేళ్ల సమయం పడుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. వయసు, లింగబేధం లేకుండా ఎవరికైనా ఈ వ్యాధి సోకవచ్చు. వంశపారంపర్యంగా ఈ వ్యాధి సంక్రమించదు. శరీరంలో ఏ భాగంలోనైనా సోకవచ్చు. కుష్ఠు బాధితులు ఎండీటీ మందులు 6 నుంచి 12 నెలలు వాడితే పూర్తిగా నయమవుతుంది. వ్యాధి ప్రారంభ దశలో గుర్తించి సరైన చికిత్స చేయించుకుంటే అంగవైకల్యానికి దారితీయదు. వ్యాధిపై అవగాహన లేనివారు సరైన సమయంలో వైద్య చికిత్సలు చేయించుకోకపోవడంతో ఇది తీవ్ర రూపం దాల్చుతోంది.

కుష్ఠు రహిత సమాజాన్ని సాధిద్దాం



జిల్లాలో ఈ నెల 11 నుంచి ఎల్‌సీడీసీ సర్వే పకడ్బందీగా నిర్వహిస్తాం. ఇప్పటికే మెడికల్ ఆఫీసర్లు, ఆశావర్కర్లకు శిక్షణ ఇచ్చాం. కుష్ఠు అనుమానితులను గుర్తించి వారందరికీ నిర్ధారణ పరీక్షలు నిర్వహించి సరైన చికిత్స అందిస్తాం. జిల్లాలోని అన్ని ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా మందులు అందిస్తారు. సర్వేకు వచ్చే ఆశాలకు ప్రజలు సహకరించాలి. కుష్ఠు నిర్మూలనకు అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నాం. కుష్ఠు రహిత సమాజమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం.

\- డాక్టర్ డాక్టర్ శశాంక్‌దేశ్‌పాండే, జిల్లా లెప్రసీ ప్రోగ్రాం ఆఫీసర్, సంగారెడ్డి జిల్లా

లింగారెడ్డిపేట్‌లో భారీ చోరీ

- 50 తులాల ఐదు బంగారు బిస్కెట్లు, 18 తులాల బంగారు ఆభరణాలు అపహరణ



చోరీ జరిగిన ఇంట్లో తనిఖీ చేస్తున్న క్లూస్‌టీం

మనోహరాబాద్, మార్చి 9: మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం లింగారెడ్డిపేట గ్రామంలో భారీ చోరీ జరిగింది. తాళం వేసిన ఇంట్లో దుండగులు దొంగతనానికి పాల్పడ్డారు. తూప్రాన్ సీఐ కృష్ణ, ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మాదాసు రమేష్ ప్రైవేట్ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. వెంకటాయపల్లికి చెందిన మామ బొబిళ్ల సత్తయ్య పదిరోజుల క్రితం మృతిచెందాడు. ఈనెల 6న దశదిన కర్మ కోసం రమేష్ కుటుంబసభ్యులతో వెంకటాయపల్లికి వెళ్లాడు. ఇదే అదునుగా భావించిన దొంగలు చోరీకి పాల్పడ్డారు. కాగా శుక్రవారం రాత్రి రమేష్ ఇంటికి రాగా తాళాలు పగులగొట్టి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి చూడగా.. మంచం కింద కబోర్డులో ఉన్న 50 తులాల ఐదు బంగారు బిస్కెట్లు, బీరువాలో ఉన్న 18 తులాల బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లినట్లు గుర్తించి పోలీసులకు సమాచారమందించాడు. శనివారం సీఐ కృష్ణతో పాటు ఎస్‌ఐ క్లూస్‌టీంతో వచ్చి పరిశీలించారు. త్వరలోనే దొంగలను పట్టుకుంటామని తెలిపారు. తమ కూతుళ్ల పెళ్లిళ్ల కోసం దాచిన బంగారం చోరీకి గురైందని, కూతుళ్ల పెళ్లిళ్లు ఎలా చేయాలని రమేష్ వాపోయాడు.

ఉడికీ.. ఉడకని అన్నం తినేదెట్లా..?

- గురుకుల పాఠశాలలో విద్యార్థుల ఆందోళన



ఉడికీ ఉడకని అన్నం

హత్నూర, మార్చి 9: మండల కేంద్రమైన హత్నూర సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో శనివారం మధ్యాహ్నం ఉడికీ ఉడకని అన్నం వండి పెట్టడంతో విద్యార్థులు ఆందోళనకు గురయ్యారు. కొంతకాలంగా కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా వంటలు చేస్తున్నారని విద్యార్థులు ఆరోపించారు. చాలాసార్లు ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకుపోయినా పట్టించుకోవడం లేదని వాపోయారు. నాణ్యమైన భోజనం ఏర్పాటు చేసే వరకూ ఆందోళన విరమించేది లేదని స్పష్టం చేశారు. ఎట్టకేలకు ప్రిన్సిపాల్ జోక్యం చేసుకుని విద్యార్థులకు నచ్చజెప్పి ఆందోళన విరమింపజేశారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి



కిష్టయ్య మృతదేహం

వర్గల్, మార్చి 9: చేపల వేటకోసం వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెందాడు. గౌరారం ఎస్‌ఐ శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. వర్గల్ తునికిఖాల్సా గ్రామానికి చెందిన మన్నె కిష్టయ్య(50) శుక్రవారం మధ్యాహ్నం పొలం వద్దకు వెళ్లివస్తానని భార్య అనసూయకు చెప్పాడు. రాత్రయినా రాకపోవడంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. శనివారం గ్రామ సమీపంలోని తపాల్‌ఖాన్ చెరువు నీటి ఒడ్డున అతని దుస్తులు కనిపించాయి. చెరువులో పరిశీలించగా కిష్టయ్య మృతదేహం నీటిపై తేలుతూ కనిపించింది. మృతుడి కొడుకు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో రైతు..



భిక్షపతి(ఫైల్)

నర్సాపూర్, మార్చి 9: విద్యుదాఘాతంతో రైతు మృతిచెందాడు. నర్సాపూర్ మండలం మాడాపూర్ గ్రామానికి చెందిన నవాపేట భిక్షపతి(45) పొలానికి నీళ్లు పెట్టేందుకు శనివారం ఉదయం కొడుకుతో కలిసి వెళ్లాడు. కాగా బోరు మోటారు నుంచి ఉన్న సర్వీస్ వైరు ఊడిపోవడంతో దానిని సరిచేసే క్రమంలో షాక్‌కు గురై భిక్షపతి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ విషయమై కొడుకు పోలీసులకు సమాచారం అందించాడు. వారు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నర్సాపూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

నార్లపూర్‌లో తల్లి, కూతురు అదృశ్యం



తల్లి, కూతురు (ఫైల్)

నిజాంపేట, మార్చి 9: తల్లి, కూతురు అదృశ్యమైన సంఘటన నిజాంపేట మండలంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండల పరిధిలోని నార్లాపూర్ గ్రామానికి చెందిన గోదూరి శ్యామల(28), తన భర్త బాలరాజుల మధ్య కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి, దీంతో తీవ్ర మనస్తాపం చెందిన శ్యామల.. కూతురు రిషిత(8)ను తీసుకుని మంగళవారం ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఆందోళన చెందిన భర్త చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

- రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ



వట్‌పల్లిలో ప్రభుత్వ ఆస్పత్రి భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న మంత్రి రాజనర్సింహ

వట్‌పల్లి, మార్చి 9: ప్రజలకు మౌలిక సదుపాయాలు, రాష్ట్ర అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. శనివారం వట్‌పల్లిలో రూ.11.20 కోట్లతో నిర్మిస్తున్న 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణానికి, రూ.2.60 సీసీరోడ్డు నిర్మాణం, గౌతాపూర్ నుంచి గొర్రెకల్ గ్రామం వరకు రూ.1.30 కోట్లతో పార్శ్వన్ రోడ్డు నిర్మాణం పనులకు ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గడిచిన పదేళ్లలో గ్రామాలలో అభివృద్ధి కుంటుపడిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడునెలల్లోనే కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. వట్‌పల్లిలో నిర్మించనున్న 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను త్వరతగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి, జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షెట్కార్, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వినయ్‌గౌడ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రమేష్‌జోషి, ఎంపీపీ పత్రి కృష్ణవేణి, జడ్పీటీసీ పత్రి అపర్ణ, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

వెంకటఖ్వాజా ఉర్సులో మంత్రి

వట్‌పల్లిలోని వెంకటఖ్వాజా 39వ ఉర్సు శనివారం అట్టహాసంగా ఇందులో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, ఎంపీ కాంగ్రెస్ అభ్యర్థి సురేష్‌షెట్కార్ హాజరై ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి గంధం తలపై పెట్టుకుని ఆశ్రమంలోని దర్గాకు తీసుకెళ్లగా ఆశ్రమ ట్రస్టు సభ్యులు వీరికి ఘనస్వాగతం పలికారు.

కాలుష్య నియంత్రణపై గత ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదు

- ఇందిరాగాంధీ దయతోనే పాశమైలారం పారిశ్రామికవాడ ఏర్పాటు
- స్కిల్ డెవలప్ మెంట్ శిక్షణ ద్వారా ఉపాధి అవకాశాలు
- జీరో లిక్విడ్ డిశ్చార్జ్ ధ్యేయంగా ప్లాంట్ ఏర్పాటు
- కాలుష్య జలాల శుద్ధి కర్మాగారాన్ని ప్రారంభించిన మంత్రులు




కాలుష్య జలాల శుద్ధి కర్మాగారాన్ని ప్రారంభిస్తున్న స్పీకర్, మంత్రులు

పటాన్‌చెరు రూరల్, మార్చి 9: కాలుష్య నియంత్రణపై గత ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదని కాలుష్య రహిత సమాజాన్ని ఏర్పాటు చేసే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతున్నదని, ఇందులో భాగంగా పాశమైలారం పారిశ్రామికవాడలో జీరో లిక్విడ్ డిశ్చార్జ్ ధ్యేయంగా కాలుష్య జలాల శుద్ధి కర్మాగారాన్ని ఏర్పాటు చేశామని శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ తెలిపారు. శనివారం పాశమైలారం పారిశ్రామికవాడలో రూ.104 కోట్లతో నిర్మించిన కాలుష్య జలాల శుద్ధి కర్మాగారాన్ని మంత్రులు కొండా సురేఖ, దామోదర్ రాజనర్సింహ, దుద్దిళ్ల శ్రీధర్‌తో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాంకీ యాజమాన్యం ఇంత మంచి కర్మాగారాన్ని స్థానికంగా ఏర్పాటు చేయడం హర్షించతగ్గ విషయమన్నారు. వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ మెదక్ పార్లమెంట్ సభ్యురాలిగా 1980లో ఇందిరాగాంధీ పాశమైలారం పారిశ్రామికవాడను ఏర్పాటు చేసి ఈ ప్రాంత ప్రజల అభివృద్ధికి పునాది వేశారన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు స్థలాలను తీసుకుని ఇతర వ్యాపారాలు సాగించిన వారిపై ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకుంటుందని చెప్పారు. అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగవుతాయన్నారు. 480 కిలో లీటర్ల పారిశ్రామిక మురుగునీటిని శుద్ధి చేయగల సామర్థ్యాన్ని కలిగి ఉన్న ఈ ప్లాంట్ జీరో లిక్విడ్ డిశ్చార్జ్ సామర్థ్యాన్ని కలిగి ఉన్నదని తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమలు, వాణిజ్యం, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖల ప్రిన్సిపల్ కార్యదర్శి జయేష్‌రంజన్, కలెక్టర్ వల్లూరు క్రాంతి, సస్టైనబిలిటీ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ గౌతం రెడ్డి, టీఎస్‌ఐఐసీ వైస్ చైర్మన్, ఎండీ డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి, టీఎస్ ఐఐసీ సీఈవో మధుసూదన్, ఐలా నాయకులు దుర్గాప్రసాద్, కొండల్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కాట శ్రీనివాస్ గౌడ్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న స్పీకర్





పోతంశెట్‌పల్లి వైన్స్ వద్ద నయా మోసం

- ఆన్‌లైన్ పనిచేయడం లేదని చెబుతున్న వైన్స్ యజమానులు
- ప్రైవేట్ వ్యక్తులను పెట్టుకుని రూ.100కు అదనంగా రూ.20 నుంచి రూ.50 వసూలు
- చర్యలు తీసుకోవాలని బాధితుల వేడుకోలు



పోతంశెట్‌పల్లి వైన్స్ వద్ద ఆన్‌లైన్ పనిచేయడం లేదని చూపిస్తున్న భక్తులు

కొల్చారం, మార్చి 9: జాతరకు వచ్చే భక్తులకు కొల్చారం మండలం పోతంశెట్‌పల్లి వైన్స్ యజమానులు శఠగోపం పెడుతున్నారు. పే యాప్‌లు పనిచేయడం లేదని ప్రైవేట్ వ్యక్తులను వైన్స్ వద్ద ఏర్పాటు చేసుకుని రూ.100కు అదనంగా రూ.20 నుంచి రూ.50 వరకు వసూలు చేస్తున్నారు. సుమారు 10 మంది యువకులను వైన్స్ వద్ద ఏర్పాటు చేసుకుని ఈ తతంగం నడిపిస్తున్నారు. దీంతో జాతరకు వచ్చే భక్తులు ఇబ్బందులకు గురవుతున్నారు. వైన్స్ ముందు బారికేడ్లను ఏర్పాటుచేసి మద్యం విక్రయాలు జరుపుతున్నారు. వైన్స్ దుకాణం వద్ద భక్తులు అడిగిన బ్రాండ్ మద్యం ఇవ్వకుండా.. ఆ బ్రాండ్ కావాలంటే ఫలానా (జాతరలో ఏర్పాటు చేసిన) బెల్ట్‌షాపునకు వెళ్లాలని సూచిస్తున్నట్లు భక్తులు ఆరోపిస్తున్నారు. అక్కడికి వెళ్లి బ్రాండ్ అడిగితే క్వార్టరుకు రూ.20 నుంచి రూ.50 అధికంగా వసూలు చేస్తున్నట్లు భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా.. ఎక్సైజ్, పోలీస్‌శాఖ అధికారుల తీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

పోతారం(ఎస్)లో జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం



జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో తలపడుతున్న జట్లు

హుస్నాబాద్‌రూరల్, మార్చి 9: హుస్నాబాద్ మండలం పోతారం(ఎస్) గ్రామంలో కృష్ణ కబడ్డీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి కబడ్డీ పోటీలను హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, ఎస్‌ఐ మహేష్ శనివారం ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతంలో ప్రతిఏటా కబడ్డీ పోటీలను నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని తెలిపారు. జిల్లాస్థాయి కబడ్డీ పోటీలలో 56 జట్లు పాల్గొంటున్నట్లు నిర్వాహకుడు కృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ అయిలేని అనిత, ఎంపీటీసీ బొమ్మగాని శ్రీనివాస్, తాజా మాజీ సర్పంచ్ బత్తిని సాయన్న, కబడ్డీ క్రీడాకారులు పాల్గొన్నారు.

వైద్య రంగంలో మహిళల పాత్ర కీలకం



ఎంసీహెచ్ డాక్టర్లు, సిబ్బందిని సన్మానిస్తున్న సాధ్వి చారిటబుల్ సొసైటీ బృందం

మెదక్ అర్బన్, మార్చి 9: వైద్య రంగంలో మహిళల పాత్ర కీలకమని డీసీహెచ్‌ఎస్ డా.చంద్రశేఖర్ పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని సాధ్వి చారిటబుల్ సొసైటీ అధ్యక్షురాలు లత ఆధ్వర్యంలో శనివారం మాతా శిశు సంరక్షణ కేంద్రంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంసీహెచ్ డాక్టర్లతోపాటు ఆసుపత్రిలోని ప్రతి విభాగంలోని మహిళా సిబ్బందిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సర్జన్ డా. శివదయాళ్ తదితరులు పాల్గొన్నారు.

సాహిత్యోత్సవ ఫెస్టివల్‌కు దేవేందర్‌కు ఆహ్వానం

హుస్నాబాద్‌రూరల్, మార్చి 9: ఢిల్లీలో ఈనెల 11 నుంచి 16 వరకు నిర్వహించే సాహిత్య ఉత్సవాలకు సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం పోతారం(ఎస్) గ్రామానికి చెందిన కవి, రచయిత అన్నవరం దేవేందర్‌కు ఆహ్వానం అందింది. కేంద్ర సాహిత్య అకాడమి కార్యదర్శి శ్రీనివాసరావు ఆయనను లేఖ ద్వారా ఆహ్వానించారు. 21వ శతాబ్దపు భారతీయ కవిత్వం, కవి సమ్మేళనంలో దేవేందర్ తన కవితను చదవాల్సిందిగా లేఖలో పేర్కొన్నారు. సాహిత్య అకాడమీ 70 ఏళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఆరురోజుల పాటు కొనసాగే సమ్మేళనంలో 175 భాషల నుంచి రచయితలు, కవులు పాల్గొని తమ కవితలను చదివి వినిపించనున్నట్లు దేవేందర్ పేర్కొన్నారు. ప్రపంచస్థాయిలో జరిగే అతిపెద్ద సాహితీ ఉత్సవాలకు దేవేందర్‌కు ఆహ్వానం రావడం పట్ల పోతారం(ఎస్) గ్రామస్థులు అభినందించారు.


జిన్నారం: జాతర సందర్భంగా ఊట్లలో లక్ష్మీనృసింహస్వామి విగ్రహాల ఊరేగింపు


ఖేడ్‌లో శివపార్వతుల కల్యాణం


హత్నూర: గుండ్లమాచునూర్‌లో మల్లికార్జున స్వామివారికి బోనాలు సమర్పిస్తున్న భక్తులు


కంగ్టి: సిద్దేశ్వరాలయంలో దర్శనం కోసం బారులు తీరిన భక్తులు


జహీరాబాద్ సిద్దేశ్వరాలయంలో శివపార్వతుల కల్యాణం

భక్త జనసంద్రంగా శైవక్షేత్రాలు


జహీరాబాద్ సిద్ధేశ్వరాలయంలో శివపార్వతుల కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు

● కనులపండువగా శివపార్వతుల కల్యాణం ● గ్రామాల్లో అట్టహాసంగా ఎడ్లబండ్లతో ఊరేగింపులు

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లోని శైవ క్షేత్రాలు భక్తజన సంద్రమయ్యాయి. శనివారం రెండో రోజు ఉత్సవాల్లో భాగంగా పలు ఆలయాల్లో శివపార్వతుల కల్యాణం, అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామాల్లో ఎడ్లబండ్లతో ఊరేగింపులు నిర్వహించారు. పలుచోట్ల అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలు జరిగాయి.


పెద్దశంకరంపేట మండలంలోని కొప్పోల్‌లో బండ్ల ఊరేగింపు


నర్సాపూర్: పెద్దచింతకుంటలో బోనాల ఊరేగింపు

సంగారెడ్డి రూరల్, మార్చి 9: సంగారెడ్డి మండలం ఫసల్‌వాది గ్రామంలోని జ్యోతిర్వాస్తు విద్యాపీఠం ఆశ్రమంలో ఆశ్రమ వ్యవస్థాపకులు మహేశ్వర శర్మ సిద్ధాంతి అధ్వర్యంలో ఎక్కడా లేని విధంగా 20.06 అడుగులతో భస్మలింగాన్ని ఏర్పాటు చేశారు. శనివారం ఆలయంలో భక్తులు అన్నప్రసాదంతో ఉపవాస దీక్షను విరమించారు. ఆలయానికి హైదరాబాద్, సిద్దిపేట, జోగిపేట, జహీరాబాద్, సదాశివపేట, సంగారెడ్డి పరిసర ప్రాంతాల నుంచి భక్తులు భారీగా హాజరై భస్మేశ్వరుడిని దర్శించుకున్నారు.

● **జిన్నారం:** శివరాత్రి సందర్భంగా ఊట్ల గ్రామంలో లక్ష్మీనృసింహస్వామి జాతరను ఘనంగా నిర్వహించారు. శనివారం ఊట్లలో జాతర సందర్భంగా స్వామివారి ఉత్సవవిగ్రహాలను గ్రామవీధుల్లో ఊరేగించగా, భక్తులు మంగళహారతులతో స్వాగతం పలికారు.

● **గుమ్మడిదల:** గుమ్మడిదల భవానీ శంకర ఆలయంలో శివ పార్వతుల కల్యాణం కమనీయంగా సాగింది. ప్రత్యేక పూజలు అభిషేకాలు అనంతరం భవాని శంకర ఆలయంలో శుక్రవారం రాత్రి 11గంటల ప్రాంతంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో కల్యాణ మండపాన్ని ఏర్పాటు చేసి, శివపార్వతుల తరఫున పలువురు పెళ్లి పెద్దలుగా కూర్చుని వేద పండితులు శంకరాచారి, రాము మంత్రోచ్చారణలతో స్వామి వారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. గుమ్మడిదలలోని సంగమేశ్వర స్వామి ఆలయంలో గ్రామానికి చెందిన స్వర్గీయ రాగన్నగారి సుధాకర్‌రెడ్డి కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేశారు.

● **నారాయణఖేడ్:** ఖేడ్‌పట్టణంలోని కాశీనాథ్ ఆలయంతో పాటు ఖేడ్‌మండలంలోని పంచగామలోని శ్రీనాగలింగేశ్వర, నాగాపూర్‌లో నాగసంగమేశ్వర, తుర్కపల్లిలోని శ్రీ సంగమేశ్వర ఆలయాల్లో మహాశివరాత్రి మహోత్సవాలు శనివారం కొనసాగాయి. ఖేడ్ కాశీనాథ్ మందిరంలో శివపార్వతుల కల్యాణాన్ని అట్టహాసంగా నిర్వహించారు. తుర్కపల్లి సంగమేశ్వర ఆలయంలో విశేష అభిషేకం, ఉమా సంగమేశ్వర కల్యాణం, నాగాపూర్‌లోని నాగ సంగమేశ్వరాలయంలో ప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

● **హత్నూర:** మండల పరిధిలోని గుండ్లమాచునూర్, సాదుల్లానగర్ గ్రామాల్లో నిర్వహించిన శ్రీ భ్రమరాంబ మల్లికార్జునస్వామి జాతర మహోత్సవాలు శనివారం వైభవంగా జరిగాయి. ఉదయం ఒగ్గు కళాకారులు భ్రమరాంబ మల్లికార్జున స్వామి కల్యాణం, అగ్నిగుండాలు, సాయంత్రం బండ్లు, బోనాల ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, పీసీసీ రాష్ట్ర కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్‌లు హాజరయ్యారు.

● **కంగ్టి:** కంగ్టిలోని సిద్దేశ్వరాలయం శనివారం శివనామ స్మరణతో మార్మోగింది. వేకువజాము నుంచే వేల సంఖ్యలో భక్తులు బారులు తీరి, పూజలు అభిషేకాలు నిర్వహించారు. నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవ రెడ్డి స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్మన్ దారం వెంకట్ ఎమ్మెల్యేను సన్మానించారు. హైదరాబాద్ వంటల సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

● **జహీరాబాద్:** పట్టణంలోని సిద్దేశ్వర, సోమేశ్వర, కైలాసగిరి శివాలయంలో పార్వతీ-పరమేశ్వరుల కల్యాణ మహోత్సవం, పల్లకీసేవ తదితర కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఆయా ఆలయాల వద్ద నిర్వహించిన కల్యాణమహోత్సవానికి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. సిద్దేశ్వరాలయంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

మెదక్ జిల్లాలో..

పెద్దశంకరంపేట, మార్చి 9: మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని పెద్దశంకరంపేట మండల పరిధిలోని కొప్పోలు ఉమా సంగమేశ్వరాలయం చుట్టూ శనివారం బండ్ల ఊరేగింపు అంగరంగ వైభవంగా నిర్వహించారు. మండల పరిధిలోని ఆయా గ్రామాల ప్రజలు రైతులు తమ ఎడ్ల బండ్లను రంగు రంగుల వస్త్రాలు, వేప కొమ్మలు మామిడాకులు, కాషాయ జెండాలతో అందంగా అలంకరించి ఆలయం చుట్టు ప్రదక్షిణ చేయించారు. మధ్యాహ్నం ఉమా సంగమేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం, వేద బ్రాహ్మణ పండితుల మంత్రోచ్చారణలతో అత్యంత వైభవంగా జరిపించారు. భక్తులు సమీప కోనేటిలో పవిత్ర స్నానాలాచరించి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. పేట తహసీల్దార్ గ్రేస్‌బాయ్, ఎస్ఐ శంకర్, పోలీసు సిబ్బంది అధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

● **నర్సాపూర్:** నర్సాపూర్ మండలం పెద్దచింతకుంటలో నిర్వహిస్తున్న దుర్గామాత జాతర ఉత్సవాలు శనివారం ఎంతో ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి పూజలతో పాటు బోనాలు, బండ్ల ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవులరాజిరెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌గుప్తా,గ్రామపెద్దలు పాల్గొన్నారు.

● **శివ్వంపేట:** మండల కేంద్రమైన శివ్వంపేటలో దుర్గమ్మ జాతర ఉత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో ఎమ్మెల్యే సునీతారెడ్డి హాజరై పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ హరికృష్ణ, జడ్పీటీసీ మహేష్‌గుప్తా, ఆలయ నిర్వాహకులు అంజయ్య, లక్ష్మీనర్సయ్య గణేష్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

● **చిన్నశంకరంపేట:** సోమేశ్వరస్వామి జాతర ఉత్సవాలను రెండోరోజైన శనివారం ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి అభిషేకం, రుద్రహోమం పూజలను నిర్వహించారు. స్వామివారికి, పోచమ్మకు కనుల పండువగా గుమ్మటాల బండ్లతో ఊరేగింపు నిర్వహించారు. పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల శివాలు, డప్పు మోతల మధ్య బండ్ల ఊరేగింపు కొనసాగింది.

● **టేక్మాల్:** మండలంలోని దనుర కాశీ విశ్వేశ్వరాలయం, ఎక్లాస్‌పూర్‌లోని మల్లికార్జునస్వామి ఆలయం వద్ద బండ్ల ఊరేగింపు నిర్వహించారు. డప్పుచప్పుళ్లు, యువకుల నృత్యాలు మధ్య బండ్ల ఊరేగింపు అంగరంగ వైభవంగా జరిగింది.

● **కౌల్దారం:** కౌల్దారంలోని శివాలయంలో మహాశివరాత్రిని పురస్కరించుకుని శుక్రవారం అర్ధరాత్రి 12 గంటల తర్వాత లింగోద్భవ అభిషేకం నిర్వహించారు. శనివారం తెల్లవారుజామున గ్రామ పురోహితులు కోలాచల శ్రీనివాసశర్మ, ఆలయ పూజారి మురళీధర్ పంతులు వేదమంత్రోచ్చారణల మధ్య జూలకంటి సంగమేశ్వర్ దంపతులు, గంగసాని రాజిరెడ్డి దంపతులు శివపార్వతుల కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

● **చిలప్‌చెడ్:** మండలం పరిధిలోని జగ్గంపేట, చండూరు గ్రామాల్లో శివరాత్రి వేడుకలు ఘనంగా కొనసాగుతున్నాయి. శనివారం చండూరు గ్రామంలో గల రామలింగేశ్వర స్వామి సన్నిదానంలో, జగ్గంపేట శ్రీసిద్ది లింగేశ్వర స్వామి సన్నిదానంలో అన్నప్రసాద వితరణ నిర్వహించారు. అనంతరం రామలింగేశ్వర గుట్టచుట్టు బండ్లతో ఊరేగింపు నిర్వహించారు. అదేవిధంగా జగ్గంపేట గ్రామంలోని స్వయంభూ శ్రీ సిద్దిలింగేశ్వర స్వామికి శుక్రవారంలింగోద్భవ కాలంలో పూజలు నిర్వహించారు.

● **మనోహరాబాద్:** మండలంలోని చెట్లగౌరారం గ్రామ శివారులో చెల్మనాయగుట్టపై వెలసిన కొండపై శివపార్వతుల విగ్రహాలతో పాటు లక్ష్మీనృసింహస్వామి పాదాలను భక్తులు దర్శించుకున్నారు. ఈ జాతర సందర్భంగా ఏటా రెండు రోజుల పాటు బోనాల ఊరేగింపు, ఒగ్గు కథలు వింటూ భక్తులు జాగరణ చేస్తారు. శనివారం తూప్రాన్ ఉమ్మడి మండలాల ప్యాక్స్ చైర్మన్ మెట్టు బాలకృష్ణారెడ్డి, ఇతర గ్రామాల కాంగ్రెస్ నాయకులు, సర్పంచ్‌లు, దర్శించుకున్నారు.


శివ్వంపేటలోని దుర్గమ్మ జాతరకు హాజరైన ఎమ్మెల్యే తదితరులు


కౌల్దారంలోని శివాలయంలో శివపార్వతుల కల్యాణోత్సవం


చిలప్‌చెడ్: చండూరు గ్రామంలో రామలింగేశ్వర స్వామివారికి దప్పు చప్పుళ్లతో బండ్లను ఊరేగిస్తున్న దృశ్యం


గుమ్మడిదల: భవానీశంకర ఆలయంలో శివపార్వతుల కల్యాణం

విగ్రహాల తొలగింపునకు నిరసనగా

గిరిజనుల రాస్తారోకో


ధర్నా చేస్తున్న గిరిజనులు, లంబాడీ సంఘం నాయకులు

చేగుంట మార్చి 9: తమ ఆరాధ్య దైవాలైన సేవాలాల్, జగదాంబ విగ్రహాలను తొలగించి తమను అవమానించారంటూ చేగుంట మండలం రెడ్డిపల్లి చౌరస్తా వద్ద గిరిజనులు, లంబాడీ సంఘం నాయకులు శనివారం సాయంత్రం 44వ జాతీయ రహదారిపై పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. దీంతో సుమారు గంటకు పైగా వాహనాలు నిలచిపోయి ట్రాఫిక్ స్తంభించిపోయింది. గిరిజనులు, లంబాడీ సంఘం నాయకులు సుభాష్ నాయక్, చక్రపింగ్‌లు మాట్లాడుతూ గత 7 ఏళ్లుగా తాము ఇక్కడ పూజలు, జాతరలు నిర్వహిస్తున్నామని తెలిపారు. చేగుంట ఎస్ఐ బాలరాజు వారిని శాంతింపచేసి న్యాయం జరిపిస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళకారులు శాంతించారు.

దరఖాస్తులు స్వీకరించారు సరే.. పరిష్కారం ఎప్పుడో?

● ముగిసిన ధరణి స్పెషల్ డ్రైవ్

● ఒక్క భూసమస్యనూ పరిష్కరించని అధికారులు

కోహీర్ మార్చి 9: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రైతుల భూ సమస్యలను పరిష్కరించేందుకు మండల రెవెన్యూ అధికారులు మార్చి 1 నుంచి 9వ తేదీ వరకు కోహీర్ మండలంలోని 24 గ్రామపంచాయతీల్లో ప్రత్యేక గ్రామసభలు నిర్వహించి భూ సమస్యలు ఉన్న రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. గతంలోనూ భూ సమస్యల పరిష్కారం కోసం మండలంలోని ఆయా గ్రామాల నుంచి 934మంది రైతులు ముందస్తుగానే మీ-సేవల ద్వారా దరఖాస్తులు చేసుకున్నారు. ఈ దరఖాస్తులతో పాటు రైతుల నుంచి రెవెన్యూ అధికారులు మరిన్ని దరఖాస్తులను స్వీకరించారు. కోహీర్ మండలంలో మొత్తం వెయ్యికి పైగా దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ బాలశంకర్ తెలిపారు. అయితే దరణి స్పెషల్ డ్రైవ్‌లో అక్కడికక్కడే భూ సమస్యలు పరిష్కారం అవుతాయని ఆశపడిన రైతులకు నిరాశే ఎదురైంది. స్పెషల్ డ్రైవ్‌లో అధికారులు కేవలం దరఖాస్తులు స్వీకరించారే తప్ప ఏ ఒక్క సమస్యనూ పరిష్కారం చేయలేదు. సమస్యల పరిష్కారం కోసం తహసీల్దార్‌లకు ధరణి లాగిన్ ఇస్తామని తెలిపిన ప్రభుత్వం ఇప్పటివరకు ఇవ్వకపోవడంతో ఏ ఒక్క దరఖాస్తు కూడా పరిష్కారానికి నోచుకోలేదు.


కోహీర్: మాచిరెడ్డిపల్లి గ్రామసభలో భూసమస్యలపై రెవెన్యూ అధికారికి విన్నవించుకుంటున్న గ్రామ రైతులు

సమస్యలు పరిష్కరించరేం..

శనివారం మండలంలోని మాచిరెడ్డిపల్లి గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో పలువురు రైతులు తమ భూసమస్యలు తెలుపుతూ ఆవేదన వ్యక్తం చేశారు. తమ గ్రామంలోని 81వ సర్వే నంబర్ ఫారెస్ట్ పరిధిలోకి వస్తుదని 200 మందికి పైగా రైతులకు రైతుబంధు, రైతుబీమా పథకాలును నిలివేశారన్నారు. ఆ సర్వే నంబర్‌లోని భూములను కొన్నేళ్లుగా సాగు చేసుకుంటున్నామని, అయితే ఫారెస్టు పరిధిలోకి వస్తుందని, తమకు రావలసిన పథకాలను నిలిపివేయడం సరైంది కాదన్నారు. భూ సమస్యలు పరిష్కరించకుండా ధరణి స్పెషల్ డ్రైవ్ అని కేవలం ఓట్ల కోసమే ఇదంతా డ్రామా చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.

జహీరాబాద్‌లో 1,159 దరఖాస్తులు

జహీరాబాద్, మార్చి 9: జహీరాబాద్ మండలంలో 1,159 ధరణికి సంబంధించిన దరఖాస్తులు వచ్చాయని డిప్యూటీ తహసీల్దార్ వంశీ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ వారం రోజులుగా ఆయా గ్రామాల్లో చేపట్టిన ప్రత్యేకడ్రైవ్‌లో ధరణి సమస్యలపై వచ్చిన దరఖాస్తులను పరిశీలించామన్నారు. అందులోభాగంగా 700ల పైచిలుకు దరఖాస్తులు ఆర్డీవో, కలెక్టర్ పరిధిలోకి సంబంధించినవి కాగా, మరో 300కు పైచిలుకు దరఖాస్తులు తమపరిధిలో ఉన్నాయన్నారు. వాటన్నింటికి త్వరలో పరిష్కరించనున్నట్టు ఆయన వివరించారు.


కంగ్టి: సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులపాలు చేసింది

పెద్దశంకరంపేట, మార్చి 9: గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని తాకట్టు పెట్టి అప్పుల పాలు చేసిందని ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి విమర్శించారు. శనివారం పెద్దశంకరంపేటలోని ప్రియాంక కాలనీలో రూ.50 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ ఏర్పడిన 10 సంవత్సరాలలో బీఆర్ఎస్ ప్రభుత్వం మిగులు బడ్జెట్‌ల ఉన్న రాష్ట్రాన్ని రూ. 8 లక్షల కోట్ల అప్పుల తెలంగాణాగా మార్చారని విమర్శించారు. పెద్దశంకరంపేట నుంచి నార్సింగ్ రోడ్డు పనులు ఇంకా పూర్తి కాలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్‌కు అనుకూలంగా ఇచ్చిన ఆరు గ్యారంటీలను తప్పకుండా అమలు చేసి తీరుతుందని వివరించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు రాయిని మధుసూదన్, మాజీ సర్పంచులు అలుగుల సత్యనారాయణ, అంజిరెడ్డి, ఎంపీటీసీ రాజు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వం ద్వారా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. శనివారం పెద్దశంకరంపేటలోని పీఏసీఎస్ ఆధ్వర్యంలో శెనగలు, పొద్దు తిరుగుడు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. కొనుగోలు కేంద్రాల్లో శెనగలకు మద్దతు ధర క్వింటాల్‌కు రూ.5,440, పొద్దు తిరుగుడుకు మద్దతు ధర రూ.6,780 చెల్లించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో పేట ఎంపీపీ జంగం శ్రీనివాస్, మార్క్ ఫెడ్ డీఎం క్రాంతి, ఏడీఏ రాంప్రసాద్, పీఏసీఎస్ చైర్మన్‌సంజీవరెడ్డి, పీఏసీఎస్ సీఈవో రవీందర్, ఆయా గ్రామాల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి పెద్దపీట

కంగ్టి/నారాయణఖేడ్, మార్చి 9: ప్రజా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని దెగుల్‌వాడిలో సీసీ రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా సంక్షేమ ఫలాలు అర్హులందరికీ అందించడమే తమ ధ్యేయమన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సర్దార్, ఉపేందర్‌రెడ్డి, రమేష్ పాల్గొన్నారు. కాగా లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ ఇంకా వెలువడలేక పోయినప్పటికీ, జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థిగా ఖేడ్‌కు చెందిన టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ సురేష్ షెట్కార్‌ను పార్టీ అధిష్ఠానం ప్రకటించడంతో కాంగ్రెస్ శ్రేణులు ప్రచారాన్ని అప్పుడే ప్రారంభించాయి. ఫ్లెక్సీలు ఏర్పాటుతో పాటు శనివారం స్థానిక ఎమ్మెల్యే సంజీవరెడ్డి, కంగ్టి మండలంలో పలు అభివృద్ధిపనులకు శ్రీకారం చుట్టారు. అనంతరం కాలనీల్లో పర్యటించి కాంగ్రెస్ లోక్‌సభ అభ్యర్థి సురేష్ షెట్కార్‌ను గెలిపిస్తే, మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టవచ్చన్నారు.

మహిళా హోంగార్డుకు సన్మానం

జోగిపేట, మార్చి 9: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం జోగిపేట పోలీస్ స్టేషన్‌లో మహిళా హోంగార్డును సన్మానించారు. స్థానిక హోంగార్డు సునీతను ఎస్ఐ అరుణ్ కుమార్‌గౌడ్, శాలువా, పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ గౌస్‌తోపాటు, సిబ్బంది శ్రీనివాస్, సంజీవ్ కుమార్, సంతు తదితరులు పాల్గొన్నారు.


మహిళా హోంగార్డును సన్మానిస్తున్న ఎస్ఐ అరుణ్ గౌడ్

బాత్‌రూంలో పడి వృద్ధుడు మృతి

తూప్రాన్, మార్చి 9: తూప్రాన్ ఆర్టీసీ బస్టాండ్‌లోని బాత్రూంలో శనివారం ఓ వృద్ధుడు కిందపడి మృతి చెందాడు. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన అర్జున్ ముజుందార్ (70) తూప్రాన్ పట్టణానికి విచ్చేసి ఓ పెయింటర్ వద్ద పనులు చేస్తు ఒంటరిగా జీవిస్తున్నాడు. కొద్దిరోజులుగా గొంతు భాగంలో ట్యూమర్ ఏర్పడి ఇబ్బందులు పడుతున్నాడు. శనివారం సాయంత్రం తూప్రాన్ ఆర్టీసీ బస్టాండ్‌లో ఉన్న బాత్‌రూంకు వెళ్లి అక్కడే పడిపోయి మృతి చెందాడు.

ఆటో బోల్తా పడి ఒకరు మృతి.. నలుగురికి గాయాలు

మేడ్చల్ టౌన్, మార్చి 9: ఆటో బోల్తా పడిన ఘటనలో పటాన్‌చెరు బండ్లగూడకు చెందిన ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా, నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మేడ్చల్ చెక్‌పోస్టు సమీపంలో చోటు చేసుకున్నది. ఘటనకు సంబంధించి మేడ్చల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పటాన్‌చెరు బండ్లగూడకు చెందిన మల్లేష్(40) శనివారం తన కుటుంబ సభ్యులతో కలిసి సిద్దిపేట కొమురవెల్లి ఆలయానికి బయలుదేరాడు. మేడ్చల్ చెక్‌పోస్టు సమీపంలో ఆటో అదుపు తప్పి రోడ్డు డివైడర్‌ను ఢీకొని బోల్తా కొట్టింది. ఈ ఘటనలో మల్లేష్ అక్కడికక్కడే మృతి చెందగా ఆటోలో ఉన్న నలుగురికి గాయాలయ్యాయి. మేడ్చల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సెయింట్ ఆంథోనీస్‌లో ఘనంగా వీడ్కోలు


వీడ్కోలు కార్యక్రమంలో పదోతరగతి విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం

సంగారెడ్డి అర్బన్, మార్చి 9 : సంగారెడ్డిలోని శాంతినగర్ సెయింట్ ఆంథోనీస్ ఉన్నత పాఠశాలలో 10 వ తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యాసంస్థల అధినేత సోలోమోన్‌రెడ్డి జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మోటివేటర్స్ మాట్లాడుతూ విద్యార్థుల్లో చైతన్యం కలిగిననాడే జీవితంలో ఏదైనా సాధించవచ్చన్నారు. అంతకుముందు విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కరుణాకర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ అరుణారెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ హెడ్ జయబాలరెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు 21 శాతం ఫిట్‌మెంట్ హర్షణీయం

మెదక్ అర్బన్, మార్చి 9: తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగులకు రావాల్సిన బెనిఫిట్స్ ఇచ్చేందుకు సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకోవడంపై టీఎంయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఆర్‌కే రావు, మెదక్ రీజియన్ అధ్యక్షుడు పీఎస్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కార్మికులకు ఇవ్వాల్సిన 2017 పే స్కేల్‌తోపాటు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా బాండ్స్ డబ్బులు ఇవ్వడం సంతోషకరమన్నారు. ఉద్యోగుల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను స్వాగతిస్తున్నామని, ప్రభుత్వానికి ఈ సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలిపారు.

చౌటకూర్, పోసానిపల్లిలో రూ.30 లక్షలతో సీసీ రోడ్లు

పుల్‌కల్, మార్చి 9: మండల కేంద్రం చౌటకూర్‌తో పాటుగా పోసానిపల్లి గ్రామంలో రూ.30 లక్షల నిధులతో నిధులతో సిమెంటు రోడ్డు పనులను కాంగ్రెస్ నాయకులు శనివారం ప్రారంభించారు. చౌటకూర్, పోసానిపల్లి గ్రామాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలంటూ మంత్రి దామోదర రాజనరసింహను గ్రామస్థులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు కోరారు. వెంటనే స్పందించిన మంత్రి ఎంఎస్‌ఆర్‌ఈజీఎస్ పథకం కింద చౌటకూర్‌కు రూ.25 లక్షలు, పోసానిపల్లికి రూ.ఐదు లక్షలు మంజూరు చేయగా, మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు నత్తి దశరత్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చక్రియాల మల్లారెడ్డిలు ముఖ్యఅతిథులుగా హాజరై టెంకాయలు కొట్టి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు వర్కల రమేశ్, నాయకులు సార గోవర్ధన్‌ముదిరాజ్, కలాలి ఈశ్వర్‌గౌడ్, మాజీ ఉప సర్పంచ్ కలాలి రామాగౌడ్, అబేద్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల నిరసన

మనోహరాబాద్, మార్చి 9: పెండింగ్‌లో ఉన్న తమ వేతనాలు వెంటనే చెల్లించాలని కోరుతూ శనివారం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద పారిశుధ్య కార్మికులు నల్ల బ్యాడ్జీలు పెట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఆసిఫ్ మాట్లాడుతూ కార్మికులకు గత 3నెలలుగా వేతనాలు చెల్లించక పోవడంతో అనేక ఇబ్బందులు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీవో 51 ను సవరించాలని, ఈ నెల 11న ఎమ్మెల్యేల ఇళ్ల ఎదుట, 21 న పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయం ముందు చేపట్టే ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

మాసాయి పేటలో పోలీసులు, సీఐఎస్ఎఫ్ కవాతు


మాసాయిపేటలో సీఐఎస్ఎఫ్ బలగాల కలిసి కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

మాసాయిపేట, మార్చి 9: పార్లమెంట్ ఎన్నికల సన్నద్ధతలో భాగంగా మండల కేంద్రమైన మాసాయి పేటలో చేగుంట ఎస్ఐ బాలరాజు ఆధ్వర్యంలో పోలీసులు, సీఐఎస్ఎఫ్ కేంద్ర పోలీసు బలగాల ఆధ్వర్యంలో కవాతు నిర్వహించారు. మాసాయిపేట ఎమ్మార్వో కార్యాలయం నుంచి గ్రామ చావిడి వరకు ర్యాలీ కొనసాగింది. ఈ కవాతులో చేగుంట పోలీసు సిబ్బంది రవి, నాయుడు పోలీసులు, సీఐఎస్ఎఫ్ బలగాలు పాల్గొన్నాయి.

సీఎంను కలిసిన సురేష్ షెట్కార్


సీఎంను కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న సురేష్ షెట్కార్

నారాయణఖేడ్, మార్చి 9: జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రకటించినందుకు టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ సురేష్ షెట్కార్ శనివారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట సోదరుడు జడ్పీప్రణాళిక మండలి మాజీ సభ్యుడు నగేష్‌షెట్కార్, టీపీసీసీసభ్యుడు కర్నె శ్రీనివాస్, కుమారుడు యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శితో పాటు సీఎం సలహాదారు వేంనరేందర్‌రెడ్డి, వంశీచంద్‌రెడ్డిలు ఉన్నారు.

వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలి

● బీజేపీ నేత, ఖేడ్ మాజీ ఎమ్మెల్యే ఎం. విజయపాల్‌రెడ్డి

కల్హేర్, మార్చి 9: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పని చేయాలని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే ఎం. విజయపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని బీబీపేట్‌లో శనివారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో బూత్ అధ్యక్షులు పార్టీ పటిష్ఠత కోసం పనిచేయాలని సూచించారు. కార్యకర్తలు, నాయకులు పార్లమెంట్ ఎన్నికల్లో అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పనిచేయాలని విజయపాల్‌రెడ్డి కోరారు. ఈ నెల 12న జరిగే హోం మంత్రి అమిత్ షా సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు ఎన్నం అనిల్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ మాజీ సభ్యుడు సంగమేశ్వర్‌రావ్, నాయకులు నరేందర్ రెడ్డి, సాయిలు, శివారెడ్డి, సతీష్, సంతోష్, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

'నల్లవాగు ప్రాజెక్టు నీటిని విడుదల చేయాలి'

కల్హేర్, మార్చి 9: సిర్గాపూర్ మండల పరిధిలోని నల్లవాగు ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలోని కల్హేర్ మండలం క్రిష్ణాపూర్, బీబీపేట్, మార్డి, ఇందిరానగర్, కల్హేర్ గ్రామాల భూముల్లో ఎండు దశకు చేరుకుంటున్న జొన్న పంటకు నల్లవాగు ప్రాజెక్ట నుంచి సాగు నీరు విడుదల చేయాలని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే ఎం. భూపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నాయకులు, రైతులతో కలిసి ఎండుతున్న జొన్న, వరి పంటలను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా ఉన్న 8 ఏళ్లలో ఏనాడూ పంటలను ఎండనీయలేదన్నారు. ఎండుచున్న పంటలను కాపాడుకోవడానికి ఆందోళన చేపడతామని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి హెచ్చరించారు. కార్యక్రమంలో కల్హేర్ జడ్పీటీసీ నర్సింహారెడ్డి, జడ్పీ కోప్షన్ సభ్యుడు ఎండి అలి, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు రాంసింగ్, మాజీ సర్పంచులు ఉన్నారు.